సాక్షి
వికారాబాద్
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



అవార్డుల పర్వం
ఆ గ్రామంలో ఎవరికి వారే తమదైన శైలిలో లక్ష్యాన్ని చేరుకుంటూ ప్రభుత్వ అవార్డులను సొంతం చేసుకుంటున్నారు. 8లో▸



దాబాల్లో మద్యం జోరు
గ్రామాలు, ప్రధాన రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన దాబాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. 9లో▸



ఘనంగా ఉత్సవాలు
బంట్వారం మండలం తొర్మామిడి గ్రామంలో బాలాజీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
మోమిన్‌పేట: సక్రమంగా విధులు నిర్వహించని, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించని పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ నారాయణ రెడ్డి సస్పెన్షన్ చేసినట్లు మండల ఇన్‌చార్జ్ అభివృద్ధి అధికారి యాదగిరి శుక్రవారం తెలిపారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడు – 4 ఫిరోజ్‌ఖాన్ నెల రోజులుగా విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు జారీ చేసిన మెమోకు సంజాయిషీ కూడా ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాలిసెట్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
అనంతగిరి: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం(పాలిసెట్ -2024) ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250, ఇతరులకు రూ.500 చెల్లించి పాలిసెట్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 24 వరకు రూ.100 అపరాధ రుసుంతో, 26 వరకు రూ.300 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో వసతులు కల్పించండి
కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో లక్ష రూపాయలు వెచ్చించి కనీస వసతులు కల్పించాలని సూచించారు. ఏయే పాఠశాలల్లో ఏయే పనులు చేయాల్సి ఉందో తెలుసుకోవాలని ఆదేశించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, ప్రహరీ వంటి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించండి
జిల్లాలోని స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీల సెక్రటరీలు ప్రతి గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకొని తమకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, వీధి దీపాల నిర్వహణ, నర్సరీ, హరితహారంపై పూర్తి వివరాలు సేకరించాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాష్, డీపీఓ జయసుధ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి ఆదరణ తగ్గలేదు
- లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతాం
- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు: ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీపై ఆదరణ తగ్గలేదని, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతామని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని మండలాల ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పార్టీని మరింత బలోపేతం చేసుకొని లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ వచ్చేలా చూడాలని నాయకులకు సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో తాండూరుకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇక నుంచి ప్రతి గ్రామానికి వస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరిస్తానని తెలిపారు. ఆరు గ్యారంటీలపై పోస్టు కార్డుల నిరసన ఉద్యమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ బీసీల కోసం పోరాడిన కాసాని జ్ఞానేశ్వర్ గెలవడం ఎంతో అవసరమన్నారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్లు తెచ్చినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

‘ఉపాధి’.. అదుర్స్

ఈజీఎస్ పనులకు రికార్డు స్థాయిలో కూలీలు
- గడిచిన నాలుగేళ్లలో ఇదే అత్యధికం
- జిల్లాలో జాబ్ కార్డులు 1.83లక్షలు
- కూలీల సంఖ్య 3.77లక్షలు
- రాష్ట్రంలో మొదటి స్థానంలో కొనసాగుతున్న జిల్లా



పెద్దేముల్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వికారాబాద్: జిల్లాలో ఉపాధి హామీ పనులకు రికార్డు స్థాయిలో కూలీలు వస్తున్నారు. 20 రోజుల క్రితం వరకు 50వేల మంది కూలీలు పనులకు వస్తుండగా ప్రస్తుతం లక్ష దాటారు. గడిచిన నాలుగేళ్లలో పనులకు వస్తున్న కూలీల సంఖ్య ఇదే అత్యధికం కావటం గమనార్హం. దీంతో ఉపాధి పనులు మరింత ఊపందుకున్నాయి. కలెక్టర్ నారాయణరెడ్డి, డీఆర్డీఓ నిరంతర పర్యవేక్షణ, సమీక్షల కారణంగా కూలీల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో ఉపాధి పనులు చేపడుతున్న 32 జిల్లాలో మన జిల్లా ముందు వరుసలో కొనసాగుతోంది. రోజు వారి పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య పరంగా చూస్తే జిల్లా మొదటి స్థానంలో ఉంది.

లక్ష దాటిన కూలీలు
ప్రస్తుతం జిల్లాలో 1,04,806 మంది కూలీలు పనులకు వస్తున్నారు. కరోనా తరువాత లక్ష మంది కూలీలు రావడం గమనార్హం. జిల్లాలో అత్యధికంగా పెద్దేముల్ మండలంలో రోజుకు 8,657 మంది కూలీలు పనులకు వస్తున్నారు. ఆ తర్వాత మర్పల్లి మండలంలో 8,467 మంది హాజరవుతున్నారు. తాండూరులో 3,962, పూడూరులో 4,581, బషీరాబాద్‌లో 4,071 మంది వస్తున్నారు. గతంలో కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం ప్రస్తుతం 50కి పైగా రకాల పనులు చేసుకోవడానికి అవకాశం ఉంది. వ్యవసాయ అనుబంధ పనులు, పొలాల గట్ల వెంబడి మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు తవ్వడం, పాఠశాల క్రీడా మైదానాల చదును చేయడం, ఫాంపాండ్స్ నిర్మాణాలు, పశువుల, గొర్రెల, మేకల పాకలు నిర్మించడం, మట్టి రోడ్లు వేయడం, చెక్‌డ్యాంలు, మట్టికట్టలు నిర్మించడం వంటి పనులు చేసుకోవచ్చు.

గత ఆర్థిక సంవత్సరంలో..
జిల్లాలో 1,83,309 జాబ్ కార్డులు ఉండగా 3,77,087 మంది కూలీలు ఉన్నారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో 59.31 లక్షల పనిదినాలను కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. 57 లక్షల పని దినాలు కల్పించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు రూ.105 కోట్లు చెల్లించారు. అయితే కూలి గిట్టుబాటు కావటంలేదని కూలీలు అంటున్నారు.

ఎండ తీవ్రత కారణంగా..
ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉపాధి పనులు జరిగే చోట ఓఆర్‌ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచారు. ఉదయం పనులకు హాజరై మధ్యాహ్నం 12గంటలలోపు ఇళ్లకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. వారం, పది రోజుల్లోగా కూలీలకు డబ్బులు చెల్లిస్తున్నారు.

వసతులు కల్పించాల్సి ఉంది
జిల్లాలో లక్షకు పైగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. వారికి షెడ్ నెట్స్, ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు అందజేశాం. ప్రస్తుతం వసతులకు సంబంధించి నిధులు విడుదల కావడం లేదు. గ్రామ పంచాయతీల గ్రీన్ బడ్జెట్ నుంచి వసతులు కల్పించాలని ప్రభుత్వం చెబుతోంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలు రావటంలేదు. త్వరలో ఈ సమస్య పరిష్కారమవుతుంది.

– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



మైల్వార్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్సే

- అందుబాటులో ఉంటా ఆశీర్వదించండి
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

బషీరాబాద్: జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి, ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలసి బషీరాబాద్ మండలం నీళ్లపల్లి ఏకాంబరి రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మండలంలో మైల్వార్, ఎక్మాయి, దామర్‌చెడ్, బషీరాబాద్, నవల్గా, గొట్టిగ, కాశింపూర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన కార్నర్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ రెండు ఒక్కటేనని ఆరోపించారు. తనను మరోసారి ఎంపీగా గెలిపిస్తే భారీగా నిధులు తెచ్చి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే రంజిత్‌రెడ్డిని స్థానిక నాయకుడు నిలదీశారు. ఐదేళ్ల కాలంలో ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి: మనోహర్‌రెడ్డి
కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో ప్రజాపాలన రావాలంటే హస్తం గుర్తుకే ఓటేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. పదేళ్ల బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో పేదలను దోచి పెద్దలకు పంచిపెట్టారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పురుషోత్తంరావు, అజయ్‌ప్రసాద్, సంపత్‌కుమార్, శంకర్‌రెడ్డి, రామ్‌నాయక్ పాల్గొన్నారు.



గౌతాపూర్‌లో పర్యటిస్తున్న అడిషన్ కలెక్టర్ రాహుల్ శర్మ

తాగునీటి సమస్య రావొద్దు

అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

తాండూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం మండంలోని గౌతాపూర్‌లో పర్యటించారు. గ్రామ సమీపంలోని వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. నీటి సమస్య ఉందా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మన ఊరు – మన బడి పథకం కింద నిర్మించిన స్కూల్ భవనాలను పరిశీలించారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని విద్యార్థులు చెప్పారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. చెంగోల్ పాఠశాలను డీపీఓ జయసుధ సందర్శించారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, పీఆర్ డీఈ వెంకట్రావ్, మిషన్ భగీరథ డీఈ రమేష్, ఎంపీఓ రతన్‌సింగ్, ఏఈలు ప్రణీత్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం సందర్శన
కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో గల ట్రైబల్ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడానికి పాఠశాలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన
నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోసం అనువైన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

అధికారులకు వ్యయ పరిశీలకుల సూచన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు పని చేయాలని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్‌చాబ్రా అధికారులను ఆదేశించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన వారు శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర అధికారులతో కలిసి ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ.. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చేసే ఖర్చులను ఏ విధంగా లెక్కిస్తున్నారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో అన్ని టీములు సమన్వయంతో పని చేయాలని, అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలన్నారు.

ప్రతిపైసా లెక్కించాల్సిందే..
ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరఫున ఖర్చుచేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చూపెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతతో సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి–విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందన్నారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

వ్యయ పరిశీలకుడిగా సెంథిల్ కుమారన్
చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ 2004 బ్యాచ్ కు చెందిన సెంథిల్ కుమారన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. కంట్రోల్ రూమును పరిశీలించారు.

గరుడ ప్రయాస!



ఆలయంలోకి వెళ్లేందుకు భక్తుల పాట్లు

పోటెత్తిన చిలుకూరు
- ప్రసాదం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్
- నాలుగైదు కిలోమీటర్ల దూరం నుంచి కాలినడక..
- క్యూ లైన్లలో తోపులాట.. సొమ్మసిల్లిన పలువురు మహిళలు
- సరైన ఏర్పాట్లు లేక తీవ్ర ఇబ్బందులు
- ప్రసాదం దొరక్క సగం మందికి తప్పని నిరాశ



ప్రసాదం కోసం ఎగబడుతున్న మహిళా భక్తులు

మొయినాబాద్: తెలంగాణ తిరుపతి.. వీసా దేవుడిగా పేరొందిన చిలుకూరు బాలాజీ ఇప్పుడు సంతాన ప్రాప్తి దేవుడిగా మారాడు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణ అనంతరం గరుత్మంతునికి నైవేద్యంగా పెట్టే గరుడ ప్రసాదాన్ని సంతానం లేని మహిళలు స్వీకరిస్తే సంతానం కలుగుతుందని ఆలయ అర్చకులు ప్రచారం చేయడంతో శుక్రవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు లక్ష మంది గరుడ ప్రసాదం కోసం రాగా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో చాలామంది తమ వాహనాలను రోడ్డు పక్కనే పార్కుచేసి నాలుగైదు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్లలో ఉన్నా చాలా మందికి ప్రసాదం దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి..
బ్రహ్మోత్సవాల సందర్భంగా సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం పంపిణీ చేస్తామని ఆలయ అర్చకుడు రంగరాజన్ కొన్ని రోజులుగా చెబుతూ వచ్చారు. ఇది సోషల్ మీడియాలో బాగా వైరల్ కావడంతో భక్తులు పోటెత్తారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ కొనసాగింది. చిలుకూరుకు వచ్చే భక్తులతోపాటు నగరం వైపు వెళ్లే వాహనదారులు, పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, చేవెళ్ల వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం తరువాత రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డితోపాటు పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

తాగునీటికి తిప్పలు
సరైన నీటి వసతి లేక భక్తులకు తిప్పలు తప్పలేదు. ఆలయం తరఫున ఒక వాటర్ ట్యాంకర్ పెట్టినా అది ఒకే చోట ఉండిపోయింది. ఆలయం వద్ద ఉన్న షాపుల్లోని వాటర్ బాటిల్స్ పూర్తిగా అయిపోయాయి. మధ్యాహ్నం చాలా మందికి మంచినీళ్లు దొరకలేదు. కొంత మంది కులాయిల్లో, స్థానికుల ఇళ్లలో నీళ్లు అడిగి తీసుకుని తాగారు.

కనుల పండువగా ధ్వజారోహణం..
బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. గరుత్మంతునికి, ధ్వజస్తంబానికి అభిషేకం నిర్వహించి తిరుమల కిరణాచారి, పరావస్తు రమాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గరుత్మంతుని పటాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభానికి ఆవిష్కరించారు. నవకలశ స్నాపకం, గరుత్మంతుని ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. తరువాత గరుడ పటానికి నాలుగు దిక్కుల గరుత్మంతుని రూపాలు ప్రతిష్ఠించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నర్సింహాచార్యులు, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి గోప వాహన, హనుమంత వాహన సేవలు అందించనున్నారు.

సగం మందికే ప్రసాదం..
ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. ఆ తర్వాత ప్రసాదం అయిపోవడంతో సగం మంది మహిళలకు అందలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. కొందరు ఆలయ అర్చకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు.

తీవ్ర ఇబ్బందులు
సుమారు మూడు నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుని, ఎండలో కాలినడకన ఆలయానికి చేరుకున్న భక్తులకు సరైన ఏర్పాట్లు లేక మరింత ఇబ్బందిపడ్డారు. ఆపసోపాలు పడి ఆలయానికి చేరుకోగా మహిళలను మాత్రమే లోనికి అనుమతించడంతో పురుషులు, ఇతర భక్తులు ఆలయం బయటే ఉండిపోయారు. క్యూలైన్లలో రెండు మూడు సార్లు తోపులాటలు జరగడంతో పలువురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కొంత మంది ఆలయం గోడలు ఎక్కి లోనికి వెళ్లారు.



గరుడ ప్రసాదం కోసం ఎండలో వేచి చూస్తున్న మహిళలు

క్లుప్తంగా

శభాష్.. అష్ఫాక్



అష్ఫాక్‌ను సన్మానించిన కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో జిల్లా నుంచి ర్యాంకులు సాధించిన అభ్యర్థులను శుక్రవారం వీడీడీఎఫ్, ఎస్ఎస్‌పీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. పెద్దేముల్ మండలం గొట్టపల్లికి చెందిన మహ్మద్ అష్ఫాక్ (770 ర్యాంక్), అతడి తల్లిదండ్రులకు కలెక్టర్ నారాయణరెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్.. శుభాకాంక్షలు తెలపడంతో పాటు అభినందించారు. ఈ కార్యక్రమంలో వీడీడీఎఫ్ ప్రతినిధులు శ్రీనివాస్, మారుతి, తిరుపతిరెడ్డి, మాణిక్‌రెడ్డి, ఫక్రుద్దీన్, కేదర్, సుజీత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో రూ.1.5 కోట్లు పట్టివేత



పట్టుబడిన నగదుతో పోలీసులు

నవాబుపేట: ఎన్నికల వేళ రూ.50 వేలకు మించి నగదును తరలించరాదని, ఒకవేళ తరలిస్తున్నట్లయితే సరైన ఆధారాలు ఉండాలని మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలో ఎస్ఐ భరత్‌భూషణ్ సిబ్బందితో మధ్యాహ్నం వాహనాల తనిఖీ నిర్వహించారు. అదే సమయంలో శంకర్‌పల్లి నుంచి నవాబుపేట వైపు వస్తున్న కారులో మోకిల్లకు చెందిన రవీందర్ రావు రూ.1.5 కోట్లతో పట్టుబడ్డారు. సదరు వ్యక్తి నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేశారు. అనంతరం డబ్బును సీఐకి అప్పగించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



అనంతగిరి: రైతులకు నకిలీ పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదని, ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనాలన్నారు. కొనుగోలు చేసి అనంతరం రశీదును తీసుకోవడం, పంట కాలం పూర్తయినంతా వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు నకిలీ విత్తనాలను, ప్యాకెట్లలో కాకుండా లూజ్‌గా విక్రయిస్తే వెంటనే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

యువకుడి ఆచూకీ కోసం గాలింపు

కొందుర్గు: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేసిన యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశా రు. సోషల్ మీడియాలో పోస్టు చేసిన మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా పోలీసులు విచారణ చేయగా శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని చాదర్‌ఘట్‌లో బుడ్డోని రాజు ఫోన్ ఉన్నట్లు తెలిసింది. అయితే ఆ ప్రాంతంలో అతడి ఉన్నట్లు ఆచూకీ లభించలేదు. కాగా అతడి మోటార్ సైకిల్ మాత్రం గురువారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఫుట్‌వేర్ ఎదుట పార్కింగ్ చేసి ఉంది. వీడియో వైరల్ కావడంతో రాజు కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. అతడి ఆచూకీ తెలుసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ వికారాబాద్ డైట్ మెయిన్ రోడ్ N/F 244 గజములు గల రెండు షెటర్స్ ఇల్లు అమ్మబడును. ఆసక్తి గల వారు సంప్ర : 9440373967, 7989825927 [H-804782]

WANTED

■ మీ గ్రామం / పట్టణంలోనే ఉంటూ అదనపు ఆదాయం కొరకు కొద్దిపాటి పెట్టుబడి పెట్టగలిగి పార్ట్ టైం మార్కెటింగ్ చేయగలవారు సంప్రదించండి. R.V.మార్కెటింగ్ ఏజెన్సీస్, Hyd 72 888 555 69 [G-672921]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆదర్శ గ్రామం.. అవార్డుల పర్వం

విభిన్న రంగాల్లో హస్నాబాద్ గ్రామస్తుల రాణింపు

కొడంగల్ రూరల్: ఆ గ్రామంలో ఎవరికి వారే తమదైన శైలిలో లక్ష్యాన్ని చేరుకుంటూ ప్రభుత్వం అందించే అవార్డులు సొంతం చేసుకుంటున్నారు. పారిశుద్ధ్యం, ఆర్మీలో సేవలు, క్రీడల్లో రాణింపు తదితర వాటిల్లో ప్రతిభ కనబర్చి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీటికి మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామం వేదికైంది.

షాట్‌పుట్‌లో రాణిస్తున్న విద్యార్థి

గ్రామానికి చెందిన విద్యార్థి సాయికిరణ్ షాట్‌పుట్ విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ ఎన్నో పతకాలు సొంతం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన అనంతరం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. సాయికిరణ్ హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటూ క్రీడా పోటీలకు హాజరవుతున్నారు. ఇప్పటివరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ చెన్నై, తమిళనాడులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్స్, కోయంబత్తూర్, చెన్నైలలో నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్స్‌లో పాల్గొన్నారు. డిస్కస్ త్రోలో గోల్డ్ మెడల్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ భోపాల్ మధ్యప్రదేశ్, ఎస్‌జీఎఫ్ఐ, నేషనల్ పార్టిసిపేషన్ హెల్డ్ ఎట్ పంజాబ్, ఇంటర్ డిస్ట్రిక్ నేషనల్ తిరుపతిలో, జూనియర్ నేషనల్ అస్సాం, సౌత్ జోన్ జూనియర్ నేషనల్ కేరళలో సిల్వర్ మెడల్, అథ్లెటిక్స్ షాట్‌పుట్ నేషనల్ హర్యానాలో గోల్డ్ మెడల్, సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ గుంటూరులో సిల్వర్ మెడల్ సాధిస్తూ రాణిస్తున్నారు. ఇటీవల సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి సాయికిరణ్ ప్రథమ బహుమతి అందుకున్నారు.



గోల్డ్ మెడల్ అందుకున్న సాయికృష్ణ (ఫైల్)

దేశ సేవలో యువకులు



దేశ సరిహద్దులో గొల్ల మల్లేశ్ (ఫైల్)

గ్రామానికి చెందిన దాదాపు 80 మందికిపైగా యువకులు ఆర్మీలో చేరారు. కొందరు దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తుండగా మరికొందరు పదవీ విరమణ పొందారు. విధులు నిర్వహిస్తున్న సైనికులు గ్రామానికి చేరుకునే సందర్భంలో గ్రామ యువకులతో అక్కడి విశేషాలను తెలియజేస్తూ ఆర్మీలో చేరేందుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. గ్రామానికి చెందిన 13 కుటుంబాల్లో ఒక్కో కుటుంబంలో ఇద్దరు చొప్పున ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. సుదీర్ఘ సేవలు చేసిన మాజీ ఆర్మీ ఉద్యోగులు కొందరు ఉత్సాహం ఉన్న యువకులను చేరదీసి అవగాహన కల్పిస్తున్నారు. దానికి తగినట్లు పరీక్షలకు హాజరయ్యేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాయామం తదితర మెళకువలతో శిక్షణ ఇస్తున్నారు.

ప్రధాని చేతుల మీదుగా అవార్డు

గ్రామంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న కంతి లక్ష్మి ఈ ఏడాది జనవరి 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంతో అధికారుల మన్ననలు పొందిన ఆమె అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఉత్తమ కార్మికురాలు అవార్డు దక్కించుకొని పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆమెను మండలంలోని పలు పాఠశాలల్లో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ తడి చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేయడం, పొడి చెత్తలోని ఇనుము తదితర వాటిని వేరు చేసి అమ్మడంతో పంచాయతీకి ఆదాయం వస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన లక్ష్మి దేశ ప్రధానితో అవార్డు పొందడం అభినందనీయమని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ప్రధాని నరేంద్రమోదీతో పంచాయతీ కార్మికురాలు లక్ష్మి (ఫైల్)

మైనర్లకు బైక్‌లు ఇవ్వడం నేరం

ఏఎస్ఐ బక్కన్న

పెద్దేముల్: మైనర్లకు బైకులు ఇవ్వడం నేరం.. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్ఐ బక్కన్న హెచ్చరించారు. శుక్రవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారి పక్కన ప్రయాణికులు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు ఇష్టం వచ్చినట్లు నడపడంతో ఎక్కువగా ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పిల్లలకు బైకులు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి వా హనదారుడు నిబంధనలు పాటించాలన్నారు. ఎఎస్ఐ, పోలీస్ సిబ్బంది బాల్‌రాజ్, జగన్, సంతోష్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

వడదెబ్బతో మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆరోపణ

పరిగి: పరిగి శివారులో ఓ మృతదేహం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్కల్ వెళ్లే దారిలో ఒంటే వాగు సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ముఖంపై పురుగులు పట్టి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో సామాజిక మాధ్యమాల్లో కొందరు యువకులు పోస్టు చేశారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహంపై ఉన్న డ్రెస్ ఆధారంగా అనుమానించి పరిశీలించగా పట్టణ కేంద్రంలోని వాంతినగర్ కాలనీకి చెందిన బేగరి జంగయ్య(48)గా గుర్తించారు. ఆయన నిత్యం మద్యం మత్తులో ఉండేవాడని గురువారం ఇంటి నుంచి బయటకి వెళ్లారని కుటుంబ సభ్యులు తెలిపారు. అదేరోజు బంధువుల అంత్యక్రియలకు భార్య పిల్లలు వెళ్లి రాత్రికి వచ్చారు. అప్పటికి జంగయ్య ఇంటికి రాలేదు. మరుసటి రోజు ఒంటే వాగు సమీపంలో గుర్తు పట్టలేనిస్థితిలో ఆయన మృతి చెందారు. ఒంటిపై ఉన్న బట్టలను గుర్తించి జంగయ్యగా కుటుంబసభ్యులు గుర్తించారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మద్యం మత్తులో వెళ్లి వడదెబ్బతో మృతి చెంది ఉంటారని పోలీసులకు లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.



జంగయ్య (ఫైల్)

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

సీఐ ఆంజనేయులు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ ఆంజనేయులు

మోమిన్‌పేట: రాహదారి వెంట వేళ్లే వారి దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో మోమిన్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఎస్ఐ అరవింద్‌తో కలిసి ప్రారంభించారు. వేసవిలో ప్రయాణం చేసేటప్పుడు దాహం వేస్తే వెంటనే దాహార్తిని తీర్చుకోవాలన్నారు. లేనిచో వడదెబ్బ తగిలే అవకాశం ప్రమాదం ఉందన్నారు. రాహదారుల వెంట ప్రతి బస్టాండ్‌ల్లో, కూడళ్ల వద్ద దాతలు చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వెల్‌చాల్‌లో ఏర్పాటు చేశామని, మోమిన్‌పేటలో కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యువకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు ఫైబర్ కేబుల్ గండం!

- గ్రామాల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు
- ధ్వంసమవుతున్న బీటీ రహదారులు
- పట్టించుకోని అధికారులు



మోత్కుర్ క్రేన్‌తో భూమిలో నుంచి కేబుల్స్ లాగుతున్న సంస్థ ప్రతినిధులు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో ఓ ప్రముఖ టెలికాం సంస్థకు చెందిన ఫైబర్ కేబుల్‌ను బీటీ రోడ్లకు ఇరువైపులా ఇష్టానుసారంగా లాగుతుండడంతో రహదారులన్నీ ధ్వంసమవుతున్నాయి. ఫైబర్ కేబుల్‌ను క్రేన్‌ల సహాయంతో భూమిలో నుంచి లాగుతూ బీటీ రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఆయా దారుల గుండా ప్రయాణించే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని గురించి సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది

దోమ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ఓ టెలికాం సంస్థకు చెందిన టవర్‌కు సంబంధించిన నూతన ఫైబర్ కేబుల్‌ను భూమిలో నుంచి లాగుతున్నారు. వీటిని పెద్ద పెద్ద క్రేన్‌ల సాయంతో లాగడంతో బీటీ రోడ్లపై గుంతలు ఏర్పడి పాడైపోతున్నాయి. రహదారిపై రాకపోకలు చేసే సమయంలో దుమ్ము, ధూళి చేలరేగి ప్రమాదాలు సైతం సంభవిస్తున్న ఘటనలు ఉన్నాయి. రానున్న వర్షాకాలంలో గుంతలు మరింతగా పెరిగి రోడ్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు మళ్లీ అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

రోడ్లకు దూరంగా వేయాలి



రోడ్లపై క్రేన్‌లను ఏర్పాటు చేసుకొని కేబుల్స్‌ను లాగుతుండడంతో బీటీ రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో గుంతలు మరింత పెద్దగా అయి రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి కేబుల్స్‌ను రోడ్లకు దూరంగా వేయించేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్‌రావు, మాజీ ఉపసర్పంచ్, మోత్కుర్

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు



ఎల్లకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భార్య సీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల, రైతుల పార్టీ అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోలకు ఉద్యోగాలు వస్తాయన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే రంజిత్‌రెడ్డి గెలిపిస్తే మరింత సేవ చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, వెంకటయ్య, ప్రభావతి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌యాదవ్, ఉపెందర్‌రెడ్డి, వెంకటేశం, బందయ్యగౌడ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

యాలాల: మండలంలోని జుంటుపల్లి రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ హుండీని ఆలయ కమిటీ, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు చేపట్టారు. గత మూడు రోజులుగా జరిగిన ఉత్సవాల సందర్భంగా హుండీలో భక్తులు భారీగా కనుకలు వేశారు. హుండీ ఆదాయం రూ.3 లక్షల 14వేల 393లు వచ్చినట్లు ఆలయ మేనేజర్ బాల్‌రాజ్, ఆలయ చైర్మన్ హన్మంత్‌రావులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టెంకాయల విక్రయానికి వేసిన వేలంలో రూ.1.83లక్షలు పలకగా, లడ్డూ వేలం రూ.1.85 లక్షలకు చేజిక్కించుకున్నారు. హుండీతో పాటు టెంకాయలు, లడ్డూ వేలం ద్వారా ఆలయానికి రూ.6.82 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారులు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు, మిఠాయి విక్రయాలు తైబజార్ వసూళ్ల లెక్కింపు ఇంకా చేపట్టలేదని, త్వరలో చేపట్టనున్నట్లు మేనేజర్ తెలిపారు.



హుండీ లెక్కింపులో గ్రామస్తులు, అధికారులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎంపీపటేల్‌గూడ విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల ముందు రోడ్డు పక్కన ఓ వ్యక్తి పడిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మరణించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించగా మెదక్‌జిల్లా అల్లాదుర్గం మండలం పెద్దపూర్‌కు చెందిన కర్రె ముత్తయ్య(54)గా గుర్తించారు. బతుకుదెరువు కోసం వచ్చాడని ఇక్కడికి వచ్చాడని వివరించారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వడదెబ్బకు మరణించాడా, లేక ఇతర ఏవైన కారణాలు ఉన్నాయా అని పోలీసులు విచారిస్తున్నారు.

కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థిపై భూ కబ్జా కేసు

న్యాయస్థానం ఆదేశంతో కేసు నమోదు చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై ఆదిబట్ల పీఎస్‌లో భూకబ్జా కేసు నమోదైంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా, పెద్ద అడిషర్లపల్లి మండలం, పెర్వాల గ్రామానికి చెందిన కంచర్ల రాధిక, ఆమె భర్త యాదగిరిరెడ్డి తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడ సర్వే నంబర్ 500, 501లోని ప్లాట్ నంబర్ 65లో 200 గజాల స్థలాన్ని 2015లో కొనుగోలు చేశారు. అప్పట్లోనే స్థలం హద్దుల మేరకు కడీలు పాతి వదిలేశారు. ఇదిలా ఉండగా.. గత ఫిబ్రవరి 17న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చామర్తి మారుతి రవిశంకర్ అనే ఇద్దరు వ్యక్తులు.. రాధిక దంపతుల ప్లాట్‌తోపాటు దక్షిణం వైపున్న రోడ్డును ఆక్రమించి ప్రీకాస్టు కాంపౌండ్ వాల్ నిర్మించారు. మాకు రాజకీయ అండదండలు ఉన్నాయి.. మమ్మల్ని ఏమీ చేయలేదరని బెదిరించారు. దీంతో సదరు మహిళ ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ఈ నెల 13న చామల కిరణ్‌కుమార్ రెడ్డి, చామర్తి మారుతి రవిశంకర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పు వెల్లడించిన జిల్లా సెషన్స్ జడ్జి సుదర్శన్

తాండూరు రూరల్: తీసుకున్న బంగారానికి సంబంధించి నగదు ఇవ్వమని అడిగిన ఓ మహిళను కిరోసిన్ పోసి నిప్పంటిచి ఆమె చావుకు కారణమైన నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పీ కోటిరెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. తాండూరు మండలం కరన్‌కోట్‌కు చెందిన వడ్డె శ్యామలమ్మ వద్ద నుంచి వరుసకు తమ్ముడైన.. మంచిర్యాల లింగప్ప 2013 ఏడాదిలో తులం బంగారం తీసుకున్నాడు. దీనికి సంబంధించి రూ.30 వేలు నగదు ఇవ్వాలని అదే ఏడాది ఫిబ్రవరి 20న శ్యామలమ్మ అడగటంతో కోపోద్రిక్తుడైన లింగప్ప ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. ఈ క్రమంలో శ్యామలమ్మకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆమెను తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో వడ్డె శ్యామలమ్మ వైద్యం పొందుతూ గాంధీలోనే మృతి చెందింది. ఆమె బంధువు వడ్డె దాసు ఫిర్యాదు మేరకు అప్పట్లో మంచిర్యాల లింగప్పపై తాండూర్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. సుదీర్ఘ వాదనల అనంతరం జిల్లా సెషన్స్ జడ్జి కె.సుదర్శన్ శుక్రవారం నిందితుడు లింగప్పకు జీవిత ఖైదుతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

స్వార్థపరులు పార్టీ వీడినా నష్టం లేదు



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన వాదే సాల్హెహీన్ బస్తీ వాసులు

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన బస్తీవాసులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే సాల్హెహీన్ బస్తీకి చెందిన ముస్లింలు శుక్రవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హామెద్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్‌ల ఆధ్వర్యంలో బస్తీ వాసులు ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపు ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంత మంది స్వార్థంతో పార్టీని వీడినప్పటికీ నష్టమేమిలేదన్నారు. మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలు వెచ్చించి చేసిన అభివృద్ధి పనులను చూసిన ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్‌ని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజద్ ఖాన్, సయ్యద్ ఫెరోజ్, మన్నాన్, అబ్దుల్ పాల్గొన్నారు.

గిరిజన బిడ్డలను చైతన్య పరచాలి

కొడంగల్: మహబూబ్‌నగర్ పరిధిలోని తండాల్లో పర్యటించి గిరిజన బిడ్డలను చైతన్యపరిచి, బీజేపీని గెలిపించాలని నియోజకవర్గ గిరిజన మోర్చా ఇన్‌చార్జి ధర్మానాయక్ కోరారు. శుక్రవారం కొడంగల్‌లో గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. పాలమూరులో బీజేపీని గెలిపించాలని కోరారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తండాల్లో ప్రతి ఇంటికి వెళ్లి బీజేపీకి ఓటు వేసే విధంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌నాయక్, పట్టణ కమిటీ అధ్యక్షుడు సర్వేష్, నాయకులు సముద్రమ్మ, రాజశేఖర్, రాములురాథోడ్, శ్రీను, గోవింద్, శ్రీనివాస్, రతన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలను సన్మానిస్తున్న ధర్మానాయక్

విజిలేస్తున్నారు!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో ఓటర్లను ప్ర భావితం చేసే అంశాలపై సి–విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 80 ఫిర్యాదులు అందగా, వీటి లో ఇప్పటికే 61 ఫిర్యాదులను పరిష్కరించారు. శేరిలింగంపల్లిలో 33, ఎల్బీనగర్‌లో 19, మహే శ్వరంలో 11 ఫిర్యాదులు అందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక వెల్లడించారు.